సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 31-1-2025

సంపుటి: 20 సంచిక: 262
పేజీలు: 8 వెల: రూ.1


## దాడికి పాల్పడినవారిని తక్షణమే అరెస్టు చేయండి

- బాలికపై దాడి ఘటనపై మంత్రి అచ్చెన్న సీరియస్
- మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులకు ఆదేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చివరి ఏడాది బీఎస్సీ చదువుతున్న బాలికపై దాడి ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సీరియస్‌గా స్పందించారు. తక్షణమే ఈ ఘటనపై విచారణ చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దాడికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈమేరకు జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డితోనూ, శ్రీకాకుళం డీఎస్పీ వివేకానందతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలితో మాట్లాడి నివేదిక అందించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారిణికి ఆదేశించారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని శ్రీకాకుళం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు.







- మహిళా బీసీ హాస్టల్ విద్యార్థినిపై దాడి
- హాస్టల్ సందులో అచేతనంగా గుర్తించిన సిబ్బంది
- సీసీ ఫుటేజ్‌లో కనిపించిన అనుమానితుడు
- బాధితురాలి కాల్‌డేటా మేరకు నిందితుడు ఒక్కడే
- స్వయంగా విచారించిన కలెక్టర్
- మెరుగైన చికిత్సకు వైజాగ్ తరలింపు
- విద్యార్థిని నోరు విప్పితేనే వాస్తవాలు వెలుగులోకి
- సీరియస్‌గా తీసుకోమన్న మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు



# హాస్టల్‌లో ఉండాల్సిన అమ్మాయి.. ఆయువు కోసం ఆసుపత్రిలో..!

సత్యంన్యూస్, శ్రీకాకుళం

**గురువారం రాత్రి 9.30 గంటల సమయం.. వన్‌టౌన్ పోలీస్ ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు హడావుడిగా రిమ్స్‌కు వెళ్లడం, అక్కడ టెన్షన్‌గా తిరుగుతూ కనిపించడాన్ని ఆసుపత్రి పరిసరాల్లో ఉన్నవారు గమనించారు. ఏదో రోడ్డుప్రమాదం జరిగుంటుందని భావించారు.**

**శుక్రవారం ఉదయం 5.20 గంటల సమయం.. వివిధ పత్రికల్లో పని చేస్తున్న రిపోర్టర్ల ఫోన్లు మోగాయి. రిమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీలో స్థానిక ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న ఒకమ్మాయి చికిత్స పొందుతుందని, ఏం జరిగిందని అడిగితే.. అమ్మాయి మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు మాత్రం ఫిట్స్ వచ్చి పడిపోయిందని హాస్టల్ సిబ్బంది తమకు తెలిపారని, అంతకుమించి తమకేమీ తెలియదని చెబుతున్నారంటూ ఉప్పందించారు.**

*సీన్ కట్ చేస్తే..* హాస్టల్ వార్డెన్ పోలీసు స్టిక్కరున్న హుండాయ్ కారులో శుక్రవారం ఉదయం 7.30 గంటల ప్రాంతానికి రిమ్స్‌కు వచ్చారు. ఫిట్స్ రావడంతోనే విద్యార్థిని పడిపోయిందని, ఆ మేరకే దెబ్బలు తగిలాయని తెలిపారు. దీంతో అటు పోలీసులు, ఇటు మీడియా కూడా ఫిట్స్ కారణంగానే తల వెనుకభాగంలో బలమైన గాయమైవుంటుందని భావించారు. కానీ.. బాధితురాలిని చూసిన ఎవరికైనా ఇది ఫిట్స్ వల్ల తగిలిన దెబ్బలు కావని, బలంగా వంటిపైన గుద్దడం వల్ల కమిలిపోయిందని అర్థమైపోతుంది. ఎందుకంటే.. ఎడమ కన్ను పూర్తిగా కమిలిపోయింది. అలాగే చేతుల్ని పట్టుకొని నులిపేయడం వల్ల వచ్చే నల్లటి మచ్చలు ఆమె వంటిపై కనిపిస్తున్నాయి. బాధితురాలికి వంటిపై చతనం లేదు. ఇక్కడ కచ్చితంగా ఏదో జరిగివుంటుందని పోలీసులకు అర్థమైపోయింది. ఈలోగానే జిల్లా మొత్తం ఉమెన్స్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగివుంటుందన్న ప్రచారం ఉప్పెనలా వ్యాపించింది. దీంతో ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోవడం మొదలుపెట్టారు. అంతవరకు హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థిని రాత్రి సమయంలో హాస్టల్ బయట గాయాలతో అపస్మారక స్థితిలో పడివుండటం వెనుక హాస్టల్ వార్డెన్ పూర్ణ నిర్లక్ష్యం ఉందని, ఆమెను కాపాడటం కోసమే ఫిట్స్ నాటకం ఆడారని భావించినవారంతా అత్యాచారం జరగలేదని తేలితే చాలు దేవుడా అంటూ మొక్కుకున్నారు. ఎందుకంటే.. ఇది ప్రభుత్వ ప్రతిష్టకు, ప్రభుత్వ

- మిగతా చివరి పేజీలో



## మూడు రోజులపాటు రథసప్తమి
## వేడుకలు వైభవంగా జరగాలి

- తొలిసారి హెలికాప్టర్ టూరిజం
- శోభాయాత్ర, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎడ్లబండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్
- ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవిల్లి రథసప్తమి వేడుకలను జిల్లాలో మూడు రోజుల పాటు అంబరాన్ని తాకేలా నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలిసారి హెలికాప్టర్ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రథసప్తమి ఉత్సవాలను మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఘనంగా శోభాయాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఉత్సవాలను విజయవంతంగా

- మిగతా చివరి పేజీలో









# ఏపీలో వాట్సాప్ పాలన..!

సత్యంన్యూస్, శ్రీకాకుళం

**సులభంగా పౌరసేవలు అందించడానికి వీలుగా వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై ప్రజలు గవర్నమెంట్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వాట్సాప్‌లోనే పౌరసేవలు, ప్రభుత్వ ధ్రువపత్రాలు పొందవచ్చని పేర్కొంది. ఇందుకోసం వాట్సాప్ మాతృసంస్థ మెటాతో ఏపీ ప్రభుత్వం అక్టోబర్ 22, 2024న ఢిల్లీలో ఒప్పందం చేసుకుంది. అధికారికంగా ఈ సేవలను 'మన మిత్ర' పేరుతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అమరావతిలో ప్రారంభించారు.**

**వాట్సాప్ గవర్నెన్స్‌లో ప్రభుత్వ అధికారిక వాట్సాప్ నెంబర్ 95523 00009 కీలకం. ప్రభుత్వం ప్రజలకు ఏదైనా సమాచారాన్ని తెలియజేయాలంటే ఈ వాట్సప్ ఖాతా ద్వారా మెసేజ్‌లు పంపిస్తుంది. ఒకేసారి కోట్ల మందికి ఈ సమాచారం చేరుతుంది. ప్రజలు వినతులు, ఫిర్యాదులు చేయడానికి ఈ వాట్సాప్ నెంబర్‌కి మెసేజ్ చేస్తే వెంటనే ఒక లింక్ వస్తుంది అందులో పేరు, ఫోన్ నెంబర్, చిరునామా తదితర వివరాలు పొందుపరిచి వారి వినతిని టైప్ చేయాలి. అలా చేసిన వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నెంబర్ వస్తుంది. దాని ఆధారంగా తమ వినతి పరిష్కారం ఎంతవరకు వచ్చింది ఎవరి వద్ద ఉంది అనేది పౌరులు తెలుసుకోవచ్చు. ఈసారి ఎన్నికల ప్రచారంలో 40 కోట్ల యూజర్లున్న వాట్సాప్ ఎంతో కీలకంగా మారిందా? గ్రూప్ అడ్మిన్లు ఏం చేయాలి, ఏం చేయకూడదు?**



### మొత్తం 161 సేవలు

పౌరసేవలు అందించేందుకు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఈ వాట్సప్ పాలనను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం **95523 00009** ఫోన్ నెంబర్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ అకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) ఉందని వెల్లడించింది. 95523 00009 నెంబర్‌కు వాట్సాప్ చేస్తే చాలు.. తొలి దశలో మొత్తం 161 రకాల పౌరసేవలు అందుబాటులోకి వస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇదే సమయంలో ప్రజల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈమేరకు ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని చంద్రబాబు సూచించారు.




### ప్రభుత్వ పథకాల సమాచారం కూడా..

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్హతలు ఆయా పథకాల ద్వారా కలిగే లబ్ధి తదితర వివరాలన్నింటినీ ఈ వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు. అలాగే ఆ పథకాల అమలుపై వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వవచ్చు. అర్హులైనవారికి పథకాలు అందకపోయినా ఫిర్యాదులు చేయవచ్చు. పౌరులకు కావాల్సిన సర్టిఫికెట్లను ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చు. అన్ని కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు తీసుకోవచ్చు. కరెంటు బిల్లులు, ఆస్తిపన్నులు వంటివి కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చెల్లించవచ్చు. పొందవచ్చు. రెవిన్యూ శాఖకు సంబంధించిన ల్యాండ్ రికార్డుల సర్టిఫికెట్లు సైతం పొందవచ్చు.

### ఆర్టీసీ టికెట్లు బుక్ చేసుకోవచ్చు

ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా ఏపీఎస్ ఆర్టీసీ టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. అలాగే టికెట్ రద్దుతో పాటు ట్రాకింగ్ సర్వీస్‌తో బస్సు గమనాన్ని కూడా తెలుసుకోవచ్చు. ఇక రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాల సమాచారం కూడా అందుబాటులో ఉంటుంది. అక్కడి టికెట్లు, వసతి సహా అన్ని సౌకర్యాలూ బుక్ చేసుకోవచ్చు. అలానే తిరుమల తిరుపతి మినహా రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో దర్శనాలు, వసతి బుక్ చేసుకోవడంతో పాటు విరాళాలు కూడా పంపొచ్చు. తిరుమలను రెండో దశలో భాగం చేసే అవకాశం ఉందని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

వరదలు, పిడుగులు, వడగాడ్పులు తదితర ప్రకృతి వైపరీత్యాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే, ఆ ప్రాంత ప్రజలకు ఈ వాట్సాప్ ద్వారానే సమాచారం అందిస్తారు. ఏదైనా ప్రాంతంలో అంటువ్యాధులు ప్రబలుతుంటే ఆ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తారు. అలాగే ఆ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై సూచనలు కూడా పంపుతారు. ఇదిలా ఉండగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిన వెంటనే తమ ఫోన్ల నుంచి ప్రయత్నించామనీ, అయితే, సర్వీసులు అందుబాటులోకి రావడంలేదంటూ పలువురు సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతున్నారు.

• ఎడిటోరియల్

# ఏ మహామేళా అయినా మరణాలే

**1954** నాటి కుంభమేళా తొక్కిసలాటలో 800 మంది మరణించారు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో తొక్కిసలాట కారణంగా 30 మంది చనిపోయారు. మరో 60మంది గాయపడ్డారు. మౌని అమావాస్య రోజు త్రివేణి సంగమంలో స్నానాల కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఈ ప్రమాదం జరిగింది. చనిపోయిన వారిలో 25 మందిని గుర్తించామని మహాకుంభ్ నగర్ మేలా ప్రాంతం డీఐజీ వైభవ్ కృష్ణ చెప్పారు. గాయపడ్డవారు చికిత్స పొందుతున్నారు. హరిద్వార్, ఉజ్జయిని, ప్రయాగ్‌రాజ్, నాసిక్‌లలో ప్రత్యేక సందర్భాల్లో కుంభమేళాలు నిర్వహిస్తుంటారు. ఎక్కువ రోజుల పాటు సాగే కుంభమేళాలో కొన్ని రోజులు ప్రత్యేకమైనవి. ఈ రోజుల్లో స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల సంఖ్య కోట్లలో ఉంటుంది. ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరిగే సమయంలో సంగమంలో స్నానమాచరించాలని భక్తులు కోరుకుంటారు. గంగ, యమున, అంతర్వాహినిగా ఉండే సరస్వతి నదులు కలిసే ప్రాంతాన్ని త్రివేణి సంగమం అంటారు. ఈ సంగమ ప్రాంతంలో స్నానమాచరిస్తే మోక్షం సిద్ధిస్తుందని నమ్ముతారు. అయితే కొన్నిసార్లు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పుడు వారికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడం కష్టమైన విషయం. కుంభమేళా సమయంలో గతంలోనూ ప్రమాదాలు జరిగాయి. 1954లో ప్రస్తుత ప్రయాగ్‌రాజ్ (అప్పటి అలహాబాద్) కుంభమేళా నిర్వహించారు. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన తొలి కుంభమేళా ఇది. ఆ కుంభమేళాలో భాగంగా 1954 ఫిబ్రవరి 3న మౌని అమావాస్య సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఓ ఏనుగు కారణంగా అక్కడ తొక్కిసలాట జరిగినట్లు చెప్తారు. ఈ తొక్కిసలాటలో 800 మందికి పైగా భక్తులు మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. కుంభమేళాకు వెళ్లొద్దంటూ అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయ నాయకులు, వీఐపీలకు ఈ తొక్కిసలాట తర్వాత సలహా ఇచ్చారు. 1986లో హరిద్వార్ కుంభమేళా జరిగింది. 1986 ఏప్రిల్ 14న అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, అనేక ఇతర రాష్ట్రాల సీఎంలు, నాయకులతో కలిసి హరిద్వార్ వెళ్లారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వారి రాకతో సాధారణ భక్తులను ఒడ్డు దగ్గరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో రద్దీ పెరిగిపోయింది. భక్తులను నియంత్రించడం సాధ్యం కాలేదు. ఈ ప్రమాదంలో దాదాపు 50 మంది చనిపోయారు. అంతకుముందు 1927, 1950ల్లో జరిగిన హరిద్వార్ కుంభమేళాల్లోనూ తొక్కిసలాటలు జరిగాయి. 1992లో ఉజ్జయినిలో సింహస్థ కుంభమేళా నిర్వహించారు. తొక్కిసలాటలో దాదాపు 50 మంది చనిపోయారు. 2003లో నాసిక్‌లో కుంభమేళా జరిగింది. సాధువులు వెండినాణేలు పంపిణీ చేశారని దైనిక్ జాగరణ్ కథనంలో ఉంది. వెండినాణేల కోసం భక్తులు ఎగబడ్డారు. ఇది తొక్కిసలాటకు దారితీసింది. దాదాపు 30 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. 100 మందికి పైగా గాయపడ్డారు. 2010లో హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించారు. అమృత స్నానాల విషయంలో భక్తులకు, సాధువులకు మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల నష్టపరిహారం ప్రకటించింది. 2013లో అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్)లో కుంభమేళా నిర్వహించారు. భక్తుల రద్దీ విపరీతంగా ఉన్న రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందిన రాయిటర్స్ తెలిపింది. ఆ ప్రమాదంలో 36 మంది చనిపోయారు. వారిలో 29 మంది మహిళలు. తొక్కిసలాటకు కారణమేంటో స్పష్టంగా తెలియలేదు. పోలీసులు భక్తులను నియంత్రించడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగిందని కొందరు చెప్పారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీద తొక్కిసలాట జరిగిందని, అక్కడి నుంచి భక్తులు కిందపడ్డారని ఒకరు తెలిపారు. మహా కుంభమేళాలు ఎక్కడ జరిగినా, ఎప్పుడు జరిగినా ప్రాణాలు పోతునే ఉన్నాయి. అయినా పుణ్యం కోసం, పాపాలు కడిగేసుకోవడం కోసం జనాలు వెంపర్లాడుతునే ఉన్నారు. అమెరికావోడి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పడగొట్టి పక్కనున్న చైనావాడు డీప్‌సీక్ ఆర్–1 తయారుచేశాడు. మనం మురికినీళ్లలో డీప్ సింక్ అయి పండగ చేసుకుంటున్నాం. మనం పతనం అంచున నిలబడిన జాతి. మునగడానికి మతం ఉంది. ముంచడానికి రాజకీయం ఉంది. మునిగి చావడానికి జనాలున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద వైరస్‌లు ఈ దేశంలోనే కనుగొన్నారు. అవి కుల మతాలు కలిగిన మనుషుల రూపంలో ఉన్నాయి. ఇవి అన్నిరకాల వైరస్‌లకన్నా ప్రాణాంతకమైనవి. ఈ వైరస్ స్వేచ్ఛాసమానత్వాన్ని తిరస్కరించింది. భ్రమలను, అబద్ధాలను, కుట్రలను నమ్మించి బానిసత్వాన్ని, మూఢత్వాన్ని పెంచి పోషించి చదువుల్ని, జ్ఞానాన్ని, చివరకు కనీస విచక్షణ మరిపించి హేతుబద్ధతను, ఆధునీకతను, అభ్యుదయాన్ని ధ్వంసం చేసిన తర్వాత మనిషి మనిషిగా కాకుండా ఇంకేమవుతాడు?

# లోకేష్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలోనే ఎంతో ప్రాచుర్యం పొంది కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలకు మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయడంతో శ్రీకాకుళం నగరం ముస్తాబవుతుంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని విధాలుగా చొరవ చూపుతున్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, ఎస్పీ కెవీ మహేశ్వరరెడ్డి సూచనలతో ఓ వైపు బందోబస్తుకు తగిన ఏర్పాట్లు మరో వైపు భక్తులు గతంలో వేగంగా స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న దుకాణ సముదాలతో పాటు అక్రమణలను తొలగించడంతో విశాలంగా మారిపోయింది. ఇంద్రపుష్కరిణికి ఆనుకుని విశాలమైన రోడ్లు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగ ప్రకటించడమే తరువాయి గత నెల రోజుల నుండి శ్రీకాకుళం నగరం అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వామివారికి రథసప్తమి రోజున ప్రభుత్వమే పట్టువస్త్రాలను సమర్పించనుంది. ఇప్పటికే సుడా, నరగపాలకసంస్థ, దేవాదాయ శాఖ, పబ్లిక్‌హెల్త్, నిధులతో అవసరమైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వెలుగులరేడు పండుగను వెలుగులతో సాగాలని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీంతో ఎమ్మెల్యే గొండు శంకర్ రథసప్తమి వేడుకలకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం నగరం సుందరీకరణ, అభివృద్ధి చేస్తున్న పనులపై ఫోటోలు, వీడియోలను చూపిస్తూ తొలిపండుగకు రావాలంటూ ఎమ్మెల్యే శంకర్‌ను ఆహ్వానించారు. నిధులు పెద్ద ఎత్తున కేటాయిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా తొలిసారిగా నగరంలోని 4, 5 కిలోమీటర్ల మేరకు స్వామివారి శోభయాత్రను సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిలో భారీస్థాయిలో భక్తులు, కళాకారులను భాగస్వామ్యం చేస్తున్నామని లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. నగరానికి ఉన్న రహదారులన్నీ సుందరీకరణ చేస్తుండడంతో భారీగా ఖర్చు అవుతున్నందున ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం చేయాలని కూడ మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే శంకర్ కోరారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందిస్తు రథసప్తమి వేడుకల్లో సామాన్య భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అరసవిల్లి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఉత్సవాలు జరపాలని ఆయన శంకర్‌ను కోరారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారన్నారు. అలాగే డైట్ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి మీరు రావాలని కోరగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఇప్పుడు వచ్చేందుకు కుదరదని, ఎన్నికల అనంతరం వస్తానని తెలిపారు.

# సేవ చెయ్యాలనే ఆశయం గొప్పది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సేవ చెయ్యాలనే ఆశయం, ఆలోచన చాలా గొప్పదని, సేవలకు ఆర్థికస్థోమత అవసరంలేదని, సేవాలోచన రావటమే సేవలకు పునాదని శ్రీకాకుళం ఒకటవ పట్టణ ఎస్.ఐ కె.హరికృష్ణ శుక్రవారం అన్నారు. స్థానికంగా నివాసముంటున్న బొమ్మాలి పోలినాయుడు అనే వికలాంగునికి వాకింగ్‌స్టాండ్ అందించారు. అనంతరం మాట్లాడుతూ పోలినాయుడు పాతబస్ స్టాండ్‌కు ఆనుకొని ఉన్న అన్న కేంటిన్‌లో పనిచేస్తున్నారని, వికలాంగుడు కావటంతో నడవటానికి ఇబ్బందిపడుతుండగా స్థానిక కాకినాడ శ్రీఆదిత్య కళాశాలలో మేనేజిమెంట్ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న జె.ప్రభాకర్, స్వాతి దంపతులు అందించిన సహకారంతో సేవకులు ఉర్లాం శివతేజ ఈ పరికరాన్ని అందించారన్నారు. ఇందులో భాగంగా అక్కడే రోజువారీ కూలీగా పనిచేస్తున్న కూన రవి అనే మరొక వికలాంగునికి మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజరౌత్ అందించిన సహకారంతో దుప్పట్లు, బట్టలు తదితర అవసరమైన సామాగ్రిని అందించారన్నారు. ఈ సందర్భంగా ఉర్లాం శివతేజ సేవలు కొనసాగాలని, పత్రికా ప్రతినిధిగా సమాజానికి సమాచారమందిస్తూ, మరో ప్రక్క సామాజిక సేవలో నిమగ్నమవ్వటం అభినందనీయమన్నారు. సేవలో భాగంగా తనను కూడా భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు.

సేవకులు ఉర్లాం శివతేజ మాట్లాడు తూ తన వాట్సాప్ స్టేటస్ ద్వారా సమాచారమందుకుని సాయమందించిన జె.ప్రభాకర్, స్వాతి దంపతులకు, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజరౌత్, ఐవిఆర్.హర్షలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు వాన జోగా రావు, జ్యోతి దంపతులతోపాటు బాధితులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ

(సత్యంన్యూస్, విజయవాడ)

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం -2025 డైరీని విజయవాడ ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్‌లను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలేజీ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పించారు. హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ఎంతో మేలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇదేవిధంగా కొనసాగిస్తూ, ల్యాబ్ సౌకర్యం, ఉచిత యూనిఫాం అందజేయాలని ఈసందర్భంగా వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మేకల మీరయ్య, వెంకటరమణమూర్తి, శ్రీనివాసరావు, తేజేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ పాల్గొన్నారు.









# 2025 జనవరి.. మళ్లీ అదే సీన్!

**2025లో అప్పుడే తొలినెల కంప్లీట్ అయిపోయింది. ఎప్పటిలానే జనవరిలో వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ముఖ్యంగా సంక్రాంతి సీజన్ ఉండటంతో మూడు బడా హీరోల సినిమాలు బరిలోకి దిగాయి. వాటికన్నా ముందు చిన్న సినిమాలు రిలీజ్ అవ్వగా.. జనవరి చివరివారంలో కొన్ని చిత్రాలు ఫినిషింగ్ టచ్ ఇచ్చాయి.**

జనవరి ఫస్ట్ వీక్‌లో డ్రీమ్ క్యాచర్, చేతిలో చెయ్యేసి చెప్పు బావతో పాటు మరో మూడు సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. అవన్నీ వీకెండ్‌కే చేతులెత్తేశాయి. దీంతో పుష్ప-2 మ్యానియా నడిచింది. ఆ తర్వాత సంక్రాంతికి గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి.

రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ మూవీతో సంక్రాంతి సందడి స్టార్ట్ అయింది. శంకర్ దర్శకత్వం వహించగా.. రూ.400 కోట్లకు పైగా బడ్జెట్ తో దిల్ రాజు నిర్మించారు. ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్ సోలోగా చేసిన మూవీ కావడంతో భారీ అంచనాలతో థియేటర్లలో రిలీజ్ అయింది. కానీ అనుకున్నస్థాయిలో అసలు మెప్పించలేకపోయింది. దీంతో మేకర్స్‌కు భారీనష్టం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఆ తర్వాత బాలయ్య డాకు మహారాజ్ విడుదలైన విషయం తెలిసిందే. బాబీ కొల్లి డైరెక్షన్‌లో సితార నాగవంశీ నిర్మించగా.. మంచి హిట్‌గా నిలిచింది. ఫస్ట్‌హాఫ్‌తోపాటు ప్రెజెంటేషన్.. సినిమాను హిట్‌గా మలిచాయి. అలా బాలయ్య మరో హిట్ ను సొంతం చేసుకున్నారు.

చివరగా అనిల్ రావిపూడి- విక్టరీ వెంకటేష్ కాంబోలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ రిలీజ్ అవ్వగా.. ఫస్ట్ షో నుంచి కూడా సూపర్ హిట్ టాక్ వినిపించింది. అన్ని సెంటర్స్‌లో మంచి రెస్పాన్స్ అందు కుంటూ.. త్వరలో రూ.300 కోట్ల క్లబ్ లో ఎంట్రీ ఇచ్చేందుకు దూసుకు పోతోంది. వెంకీ కెరీర్‌లో ది బెస్ట్‌గా హిట్ గా నిలిచింది. అయితే గత ఏడాది జనవరిలో జరిగినట్లే ఈసారి కూడా జరిగిందనే చెప్పాలి. అప్పుడు- ఇప్పుడు ఫస్ట్ వీక్ బాక్సాఫీస్ డల్‌గానే ఉంది. అప్పుడు గుంటూరు కారం భారీ అంచనాలతో థియేటర్లలో రిలీజ్ అయినా.. అనుకున్న స్థాయిలో టాక్ సంపా దించుకోలేక పోయింది.

వసూళ్ళ పరంగా మాత్రం మేకర్స్‌కు నష్టాలు రాలేదని చెప్పవచ్చు. ఇప్పుడు గేమ్‌ఛేంజర్.. భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. నష్టాలు కూడా ఎక్కువగానే వచ్చినట్లు తెలుస్తోంది. అప్పుడు హనుమాన్.. సర్ప్రైజ్ హిట్ ఎలా అయిందో.. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం కూడా అలాగే అయింది. అప్పుడు నెల చివర్లో పలు చిన్న సినిమాలు వచ్చాయి. ఇప్పుడు కూడా అంతే. మొత్తానికి 2024 జనవరి సీనే.. 2025 జనవరిలో కూడా కంప్లీట్‌గా రిపీట్ అయిందన్నమాట.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

# లేడీ మన్నార్ ఐకానిక్ ఫోజ్!



తెలుగు కుటుంబంలో జన్మించిన తమిళనాట సెటిల్ అయిన ముద్దుగుమ్మ శ్రీయా రెడ్డి. తమిళ్‌లో పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటించి మెప్పించిన ఈ అమ్మడు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తెలుగులో నటించిన శ్రీయా రెడ్డి సుదీర్ఘ గ్యాప్ తర్వాత టాలీవుడ్‌లో నటించింది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్' సినిమాలో ఈ అమ్మడు నటించింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు పాతిక ఏళ్లు అవుతున్నా ఈమె అందం మాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో 3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు మరోసారి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి స్టైలిష్ ఔట్ ఫిట్‌లో ఐకానిక్ ఫోజ్ ఇచ్చింది. క్లీవేజ్ షోతో చూపు తిప్పుకోనివ్వని ఈ అమ్మడి ఫోటోలకు నెటిజన్స్ తెగ ఫిదా అవుతున్నారు. హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా ఉన్న ఈ అందంతో ఎందుకు సినిమాల్లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. అందమైన ఈ అమ్మడి అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ ఫోటోలను ఫిల్మ్ మేకర్స్ చూస్తే హీరోయిన్‌గా ఆఫర్లు ఇస్తారేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. శ్రీయా రెడ్డి అప్పటి కంటే ఇప్పుడు ఇంకా ఎక్కువ అందంగా ఉందని కొందరు అంటున్నారు.

సలార్ సినిమాలో నటించిన తర్వాత ఎక్కువ శాతం శ్రీయా రెడ్డికి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. సలార్ తో పాటు పవన్ కళ్యాణ్ హీరోగా సాహో సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓజీ' సినిమాలోనూ శ్రీయా రెడ్డి ఎంపిక అయ్యింది. కానీ పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉన్న కారణంగా ఓజీ సినిమా ఆలస్యం అవుతూ వస్తోంది. ఓజీ సినిమాలోనూ తన పాత్ర అత్యంత పవర్ ఫుల్‌గా ఉంటుందని శ్రీయా రెడ్డి గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చింది. అయితే లేడీ విలన్ పాత్రను పోషించారా అనే విషయంపై మాత్రం క్లారిటీ ఇవ్వకుండా సస్పెన్స్‌లో ఉంచింది.

గతంలో మాదిరిగా కాకుండా ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇంతటి అందం ఉంచుకుని సోలో హీరోయిన్‌గా సినిమా చేస్తే బాగుంటుంది కదా అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్న శ్రీయా రెడ్డి చాలా గ్యాప్ తీసుకుని రీ ఎంట్రీ ఇచ్చింది. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ చాలా స్లోగా సినిమాలు చేస్తోంది. ఇక ముందు అయినా ఈ అమ్మడు స్పీడ్‌గా సినిమాలు చేస్తుందేమో చూడాలి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...




# భావనపాడు బీలల్లో..

# విధ్వంసక లీలలు వద్దు!

## అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి డా.ఇ.ఎస్.శర్మ లేఖ

శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు పోర్ట్‌కు అనుసంధానంగా, ఆంధ్రప్రదేశ్ లోని ఎన్‌డిఎ ప్రభుత్వం (NDA Government) 10వేల ఎకరాల భూమిని సేకరించి, పెట్రోకెమికల్ పరిశ్రమ (Petrochemical Industry) లను స్థాపించే ఆలోచనలో ఉందని వార్తలు వస్తున్నాయి. అందులో భాగంగా, గతంలో భావనపాడు థర్మల్ పవర్ ప్లాంటు (Bhavanpadu Thermal Plant) కోసం సేకరించిన 2,100 బీల భూములు, 4,500 ఎకరాల సాల్ట్ పాన్ భూములు కూడా ఉన్నాయి ఈ విషయాన్ని స్వయంగా అర్థం చేసుకునే ఉద్దేశంతో, నేను 27-1-2025 న, ఆ ప్రాంతంలో పర్యటించి, అక్కడి ప్రజలతో చర్చించడం జరిగింది. అక్కడి ప్రజలతో, ముఖ్యంగా మత్స్యకారులతో కలిసి, భావనపాడు బీలల పరిరక్షణ విషయంలో కోర్టులను ఆశ్రయించిన వారిలో నేను ఒకడిని అని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను.

అటువంటి పెట్రోకెమికల్ పరిశ్రమల కారణంగా, అక్కడ ఉన్న బీలలకే కాకుండా, దగ్గరలో ఉన్న తేలినీలాపురం పక్షుల అభయారణ్యం (sanctuary)కి కూడా అపారమైన నష్టం కలుగుతుంది. బీల భూములలో పరిశ్రమలు పెట్టడం, కేంద్ర వెట్ ల్యాండ్స్ కన్సర్వేషన్ రూల్స్ (Wetlands Conservation Rules) ను ఉల్లంఘించడం అవుతుంది. పైగా, బీలలను ఆనుకుని ఉన్న తేలినీలాపురం పక్షుల నెలవు మీద, ఆ పరిశ్రమల వలన అత్యంతమైన ప్రభావం ఉంటుంది. సాల్ట్ పాన్ (Salt pan) భూములు, కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (CRZ) నోటిఫికేషన్ క్రింద, CRZ క్యాటగరి ఎ (I.A) భూములుగా పరిగణించ బడతాయి. అటువంటి సాల్ట్‌పాన్ భూములలో పరిశ్రమలు పెట్టడం కూడా చట్ట విరుద్ధం. పెట్రో కెమికల్ పరిశ్రమకు బదులు, ప్రజల ముందస్తు ఒప్పందంతో, అటువంటి ప్రాంతంలో, చట్ట నిబంధనలకు లోబడి, వ్యవసాయ ఉత్పత్తి, మత్స్య సంపదకు అనుగుణంగా పరిశ్రమలు, డైరీకి సంబంధించిన కార్యక్రమాలు చేపడితే ప్రజలు హర్షిస్తారు అని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. భావనపాడు బీలలు: రాజ్యాంగం 48A ఆర్టికల్ క్రింద, కేంద్ర Wetlands Conservation Rules క్రింద, జాతీయ హరిత ట్రిబ్యునల్ (NGT) వారు 13-4-2022 న సోంపేట బీలల విషయంలో (OA No. 153/2016) ఇచ్చిన తీర్పు ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా బీలలను గుర్తించి, పరిరక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ముఖ్యంగా, కేంద్ర పర్యావరణ పరిరక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా, Salim Ali Centre for Ornithology and Natural History (SACON) సంస్థ 2012 జూలైలో భావనపాడు బీలల ప్రాముఖ్యతను గురించి ఇచ్చిన విపులమైన రిపోర్టును (https://www.sacon.in/wp-content/uploads/2015/06/2012-PR105.pdf) చదివితే, భావనపాడు బీలల ప్రాముఖ్యత గురించి అవగాహన కలుగుతుంది.

ఆ రిపోర్ట్‌లో, భావనపాడు బీలల సామాజిక, పర్యావరణ ప్రయోజనాల గురించి విపులంగా ప్రస్తావించడం జరిగింది. భావనపాడు బీలల మత్స్య సంపద మీద, వడ్డితాంధ్ర వంటి గ్రామాలలో, వందలాది చిన్నకారు కుటుంబాలు ఆధారపడి, ఉపాధి పొందుతున్నారు. బీలల వలన, పరిసర ప్రాంతంలో, భూగర్భ జలాలు సమృద్ధిగా లభిస్తున్నాయి.. అటువంటి బీల భూములను గతంలో ప్రభుత్వం 2008లో జారీచేసిన GOMs No.1108 ద్వారా ఒక ప్రైవేట్ థర్మల్ పవర్ ప్లాంటుకు చట్టవిరుద్ధంగా కేటాయించడం జరిగింది. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. కోర్టును ఆశ్రయించారు. ఆ విషయంలో దశాబ్దానికి పైగా వడ్డితాంధ్రలో ఒక శిబిరం స్థాపించి, నిరసన దీక్ష చేపట్టిన మత్స్యకార మహిళలను కలిసి, వారిని సంప్రదిస్తే, వారి ఆవేదన అర్థమవుతుంది. ఆ భావనపాడు బీల భూములను, ప్రైవేట్ కంపెనీల ఆధీనంలో నుంచి వెనక్కి తీసుకుని, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించే బదులు, ఇతర కంపెనీలకు పెట్రోకెమికల్ పరిశ్రమల కోసం ముట్టపెట్టడం బాధాకరమైన విషయం. భావనపాడు క్రీక్: భావనపాడు పోర్ట్ సమీపంలో పెట్రోకెమికల్ పరిశ్రమలు వస్తే, దగ్గరలో ఉన్న భావనపాడు క్రీక్ మీద, అక్కడ మడ అడవుల మీద కూడా ప్రభావం ఉండగలదు. భావనపాడు క్రీక్, స్థానిక పర్యావరణం వలన కలిగే ప్రజా ప్రయోజనాల మీద, విపులంగా పరిశోధనలు జరిగాయి. Bulletin of Environment, Pharmacology and Life Sciencesలో ప్రచురించబడిన పరిశోధనా పత్రం (https://bepls.com/dec_2014/13a.pdf), ఇందుకు ఉదాహరణ. పెట్రోకెమికల్ పరిశ్రమలు పెట్టి, భావనపాడు క్రీక్‌ను కాలుష్య పరచడం అతి సులభం. అటువంటి ఏకైక పర్యావరణ వనరును కాపాడుకుని, భవిష్యత్తులో వచ్చే తరాలకు అందించడం కష్టం. రాష్ట్రంలో, APPCB వంటి కాలుష్య నియంత్రణ సంస్థలకు, రసాయన కాలుష్యాలను వెదజల్లే అటువంటి పరిశ్రమలను నియంత్రణ చేసే సామర్థ్యం, నైపుణ్యం లేదని గుర్తించాలి. ఆ సంస్థలలో కొంతమంది అధికారులు చిత్తశుద్ధితో అటువంటి పరిశ్రమలను నియంత్రించే ప్రయత్నం చేసినా, ప్రభుత్వం వారిని సమర్ధించడం అరుదు. తేలినీలాపురం bird sanctuary: భావనపాడు బీలలను ఆనుకుని ఉన్న తేలినీలాపురం bird sanctuaryలో, ప్రతి ఏడాది శీతాకాలం, రష్యా లో సైబీరియా ఎడారి నుంచి, వేలాది మైళ్ళ ప్రయాణం చేసి, సుమారు 3,000 ల అపురూపమయిన పక్షులు (Pelicans, Painted Storks) నెస్టింగ్ కోసం వస్తాయి. ఆ రోజుల్లో, sanctuaryని వందలాది మంది పర్యాటకులు, ముఖ్యంగా విదేశీయులు దర్శిస్తారు. ఆ పక్షులు, చుట్టుపక్కల ఉన్న బీలల్లో, చెరువుల్లో ఉన్న మత్స్య సంపద మీద ఆధార పడతాయి. గతంలో, ఆ sanctuaryకి, 10వేలకు పైగా సైబీరియా నుంచి పక్షులు వచ్చేవి. థర్మల్ పవర్ ప్లాంట్ వారు కొంత మట్టుకు భావనపాడు బీలలకు నష్టం కలిగించడం కారణంగా పక్షుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

భావనపాడు పోర్ట్ పరిసర ప్రాంతంలో పెట్రోకెమికల్ పరిశ్రమలు పెడితే, అటువంటి మత్స్య సంపదకు నష్టం కలిగి, తేలినీలాపురం sanctuary మీద ప్రభావం కలుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన అటువంటి పర్యావరణ వనరును ధ్వంసం చేసుకోవడం, సబబు కాదు. మన రాష్ట్రంలో, తేలినీలాపురం వంటి బర్డ్ నెలవులు ఎన్నో ఉన్న విషయం గుర్తించాలి. దగ్గరలో, ఇచ్చాపురం దగ్గర, తేలుకుంచి sanctuary ఉంది. విశాఖపట్నం దగ్గరలో కొండకర్ల ఆవ, కృష్ణా గోదావరి ప్రాంతంలో, కొల్లేరు, గుంటూరు దగ్గర ఉప్పలపాడు, తిరుపతి సమీపంలో నేలపట్టు, పులికాట్ నెలవు ఉన్నాయి. ఆ నెలవులను ప్రభుత్వం నిర్లక్ష్యం వలన, పారిశ్రామీకరణ వలన, క్రమంగా ధ్వంసానికి గురి అవుతున్నాయి. ప్రభుత్వం తత్ క్షణం ఆ నెలవులను పరిరక్షించే దిశలో, తగిన కార్యక్రమాలు చేపట్టకపోతే, పది పదిహేను సంవత్సరాలలో, ఆ వనరులు పూర్తిగా ధ్వంసానికి గురి అవుతాయి అని గుర్తించాలి. రాష్ట్రంలో, ప్రతి పక్షుల రక్షిత నెలవులను(bird sanctuary) లో, పక్షి సంపద నిర్వహణ కోసం, నెలవులపరిరక్షణ కోసం, ఏటా అటవీ శాక (Forest Department)కు, కనీసం Rs.2లక్షల నిధులు ప్రభుత్వం కేటాయించాలని నా విజ్ఞప్తి. ఇతర కార్యక్రమాలు మీద ప్రభుత్వం ఖర్చు చేసే వేలాది కోట్ల రూపాయలతో పోల్చి చూస్తే, ఇది చాలా తక్కువ. ముఖ్యంగా, రాష్ట్రంలో బర్డ్ రక్షిత నెలవులను పరిసరాల్లో ఉన్న బీలల్లో, చెరువుల్లో మత్స్య సంపదను పెంపొందించే దిశలో ప్రభుత్వం, ప్రత్యేకంగా ప్రణాళికలు చేపట్టాలి.

**సాల్ట్ పాన్ భూములు:** సాల్ట్ పాన్ భూములు, కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన CRZ నోటిఫికేషన్ క్రింద CRZ IA భూములుగా పరిగణించ బడతాయి. అటువంటి సాల్ట్ పాన్ భూములలో పరిశ్రమలు పెట్టడం చట్టవిరుద్ధం. సాల్ట్‌పాన్‌ల వలన తీరంలో పర్యావరణకు కలిగే లాభం దృష్ట్యా, ఆ భూములను CRZ పరిధి లోనికి తీసుకు రావడం జరిగింది. కేంద్ర పరిశ్రమాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2012లో ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం సాల్ట్ పాన్ భూములను ప్రైవేట్ సంస్థలకు బదలాయించడం నిషేధించబడినది.

అదే కాకుండా, ఆ సాల్ట్ పాన్ భూముల మీద వందలాది ప్రజలు ఉపాధి కోసం ఆధారపడుతున్నారు. అటువంటి భూములను పరిశ్రమల కోసం సేకరించడం ప్రజా ప్రయోజనాలను వ్యతిరేకించడం అవుతుంది. ప్రజల సమ్మతి లేకుండా, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదు: మన రాజ్యాంగం కలిగించిన ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రజల వద్ద నుంచి, పరిశ్రమల కోసం పెద్ద ఎత్తున భూములను సేకరించడం మీద, ప్రజలు ఆధార పడే బీలలు, సాల్ట్ పాన్ భూములను పారిశ్రామికవేత్తలకు, చట్టాలను ఉల్లంఘిస్తూ బదలాయించడం మీద, ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదు. ఇప్పటికైనా, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ప్రభుత్వం క్రింద సూచించిన విధంగా తత్ క్షణం చర్యలు తీసుకోవాలని నా విజ్ఞప్తి: 1. భావనపాడు బీలల విషయంలో గతంలో జారీ చేసిన 1108 GO ను వెనక్కి తీసుకుని, బీలలను ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాలి 2. భావనపాడు పోర్టు సమీపంలో పెట్రోకెమికల్ పరిశ్రమలను స్థాపించే ప్రణాళిక నుంచి, ప్రభుత్వం విరమించుకోవాలి 3. తేలినీలాపురం బర్డ్ sanctuary పరిరక్షణ విషయంలో, ఇతర bird sanctuaryల విషయంలో, మీద సూచించిన చర్యలు ఆలస్యం చేయకుండా తీసుకోవాలి 4. భావనపాడు క్రీక్‌ను, బీలలను పరిరక్షించే సమగ్రమైన ప్రణాళిక చేపట్టాలి 5.సాల్ట్ పాన్ భూములలో పరిశ్రమలు పెట్టడం చట్టవిరుద్ధం. అటువంటి ఆలోచన నుంచి ప్రభుత్వం విరమించుకోవాలి 6. పెట్రో కెమికల్ పరిశ్రమలకు బదులు, ప్రజల ముందస్తు ఒప్పందంతో, అటువంటి ప్రాంతంలో, చట్ట నిబంధనలకు లోబడి, వ్యవసాయ ఉత్పత్తి, మత్స్యసంపదకు అనుగుణంగా పరిశ్రమలు, డైరీకి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టే దిశలో ప్రభుత్వం ముందుకు పోవాలి 2024 అక్టోబర్‌లో వన్య ప్రాణి సంరక్షణ దినం సందర్భంగా మీరు, అభివృద్ధి విషయంలో పర్యావరణ పరిరక్షణకు ఎటువంటి ప్రాముఖ్యత ఇవ్వాలో ప్రజలకు స్పష్టముగా తెలియచేసారు అదే దిశలో మీరు భావనపాడు ప్రాంతం పర్యావరణ వనరులను పరిరక్షించడం దిశలో, మీద సూచించిన సలహాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాను. అదే భావనపాడు ప్రాంతంలో ప్రజల కోరిక అని తెలియ చేస్తున్నాను.

- డాక్టర్ ఇ.ఎ.ఎస్.శర్మ

# ప్రజల అభిమానాన్ని పొందిన వ్యక్తి వైవీ సూర్యనారాయణ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల అభిమానాన్ని పొందిన వ్యక్తి దివంగత ఎచ్చెర్ల వెంకట సూర్యనారాయణ అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని కిల్లిపాలెంలో సూర్యనారాయణ విగ్రహావిష్కరణ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మాన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకట సూర్యనారాయణ విగ్రహావిష్కరణకు అన్ని రాజకీయపార్టీల నాయకులు హాజరుకావడం ముదావహమన్నారు. ఆయన కన్నుమూసి సంవత్సరం కావస్తుందన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు కలిసి వెంకట సూర్యనారాయణ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వెంకటసూర్యనారాయణ కిల్లిపాలెం సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. 2001 నుంచి 2006 వరకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా వ్యవహరించారని ధర్మాన గుర్తు చేశారు. ఆయన తండ్రి అప్పన్న కూడా సమితి అధ్యక్షునిగా పనిచేసి క్రియాశీలక రాజకీయాల్లో మొదటితరం వ్యక్తులుగా ప్రజల మన్ననలు పొందారన్నారు. అదే కుటుంబం నుంచి సూర్యనారాయణ రెండో కుమారుడు శ్రీధర్ భార్య దివ్య శ్రీకాకుళం జెడ్పీటీసీగా ఎన్నికయ్యారని, మూడు తరాల నుంచి రాజకీయాల్లో ఉంటూ ప్రజల అభిమానాన్ని చాటుకుంటున్నారన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీమంత్రులు ధర్మాన కృష్ణదాస్, గుండ అప్పలసూర్యనారాయణ, కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి, కిల్లి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డిశాంతి, గుండ లక్ష్మీదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, యువనేత ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకు చిరునామా గొలివె అప్పారావునాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సేవకు చిరునామాగా స్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు చేసిన సేవలు నిలుస్తాయని ప్రముఖ వైద్యులు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ నిపుణులు డాక్టర్ గొండు గంగాధర్ పేర్కొన్నారు. స్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు నాలుగవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రెడ్ క్రాస్ కేంద్రంలో ఏర్పాటుచేసిన రక్తదాన కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వర్ధంతి సందర్భంగా రక్తదానం కార్యక్రమం నిర్వహించడం సమాజంలో చైతన్యం కలిగించే అంశమన్నారు. స్వర్గీయ గొలివె అప్పారావునాయుడు తనయుడు, శ్రీకాకుళం సిటిజన్ ఫోరం కార్యదర్శి జిఎల్ఎల్ నర్సునాయుడు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి కార్యక్రమానికి రక్తదానం చేసిన రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి జగన్మోహనరావు మాట్లాడుతూ నర్సునాయుడు తన తండ్రి చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏటా రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త విశ్రాంత జిల్లా విద్యా శాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు, లయన్స్‌క్లబ్ సీనియర్ ఆఫీసర్ నటుకుల మోహన్, డాక్టర్ నిక్కు అప్పన్న, లుకలాపు గోవిందు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, జి.రమణ, రక్తదానం చేసిన యువత, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పాలక మండళ్లలో బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణులకు చోటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆలయాల పాలకమండళ్ల నియామకంలో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ సామాజికవర్గాలకు చోటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1100 ఆలయాలకు జరిగే పాలక మండళ్ల నియామకం కోసం ప్రతిపాదనలు పంపే సమయంలో ఈ వర్గాల వారి పేర్లు కూడా పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను టీడీపీ నాయకత్వం ఆదేశించింది. దీంతోపాటు కళింగకోమట్లను కూడా పాలక మండళ్లలో చేర్చాలని ఆ సామాజికవర్గానికి చెందినవారు కోరుతున్నారు.



నరసన్నపేటలో వివిధ సేవాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తూ సామాజిక సేవలందిస్తున్న సామాజిక సేవాభిలాశి సదాశివుని క్రిష్ణను శుక్రవారం కలివరపుపేట షిర్డీసాయి మందిరం భజన సేవా సంఘం సత్కరించింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొండేటి పాపారావు, కార్యదర్శి అంపలాం వసంత కుమార్, కోశాధికారి వి.నాగేంద్ర, తాన్ని వల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, నరసన్నపేట

# 2న క్రీడా జట్ల ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2న పాతపట్నం ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గురాడి అప్పన్న, జై షణ్ముఖరావులు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన క్రీడాకారులు 8, 9 తేదీల్లో కర్నూల్లో జరుగునున్న రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు, జాతీయ స్థాయి సెలక్షన్‌లలో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకల్లా ఎన్టీఆర్ గ్రీన్‌పార్క్ మైదానంలో హాజరుకావాలని సూచించారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ. వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు

# నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

**రథసప్తమికి ప్రత్యేక పార్కింగ్‌లు ప్రకటించిన పోలీసులు**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్ణయించినందున రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లింపు అమలులోకి వస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కేవీ రమణ, టౌన్ డీఎస్పీ వివేకానంద తెలిపారు. ఈమేరకు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సింహద్వారం జంక్షన్ మీదుగా వచ్చే భక్తులు కిమ్స్ హాస్పిటల్, డే అండ్ నైట్ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్ మీదుగా పాతబస్టాండ్ వరకు వచ్చి, అక్కడి నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ మీదుగా 80 అడుగుల రోడ్డులో రెండుచోట్ల ఏర్పాటుచేసిన స్థలాల్లో వాహనాలు పార్క్ చేసుకోవాలని సూచించారు. కొత్తరోడ్డు మీద నుంచి వచ్చే భక్తులు బలగ జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేద్కర్ జంక్షన్, డే అండ్ నైట్ జంక్షన్, పందుంపుల్లల జంక్షన్, పాతబస్టాండ్ మీదుగా పీఎస్ఎన్ఎం మిల్లు జంక్షన్‌కు చేరుకొని 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. పెద్దపాడు వైపు నుంచి వచ్చే భక్తులు సూర్యమహల్, చిన్నబరాటం వీధి నుంచి అరసవల్లి మీదుగా మిల్లు జంక్షన్‌కు చేరుకొని నిర్దేశించిన ప్రదేశంలో వాహనాలు నిలపాలన్నారు. నవభారత్ మీదుగా వచ్చే భక్తులు గుజరాతిపేట మీదుగా సెవెన్‌రోడ్ జంక్షన్‌కు, అటునుంచి పందుంపుల్లల జంక్షన్ మీదుగా పసగాడ నారాయణ మిల్లు జంక్షన్‌కు వచ్చి 80 అడుగుల రోడ్డులో వాహనాలు నిలపాలన్నారు. గార, శ్రీకూర్మం మీదుగా వచ్చే భక్తులు వాడాడ జంక్షన్ మీదుగా వచ్చి అక్కడ ఏర్పాటుచేసిన పార్కింగ్‌లో వాహనాలను పెట్టాలి తప్ప అరసవల్లి గ్రామం వైపు ఎలాంటి వాహనాలు అనుమతించమన్నారు. 80 అడుగుల రోడ్డులో నిర్దేశించిన ప్రదేశంలో పార్క్ చేసిన వాహనాలు దర్శనానంతరం వాంబే కాలనీ జంక్షన్, పొన్నాడ బ్రిడ్జి జంక్షన్ మీదుగా సంతోషిమాత కోవెల రోడ్డులో జిల్లాపరిషత్ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న రోడ్డును అనుసరించి కిన్నెర థియేటర్, పాత బస్టాండ్, ఏడురోడ్ల జంక్షన్ నుంచి జాతీయ రహదారికి వెళ్లేవారు నవభారత్ వైపు వెళ్లాలని సూచించారు. అలాగే నరసన్నపేట వైపు వెళ్లాలనుకున్న భక్తులు అంపోలు అండర్ బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డులో ప్రవేశించి జైలురోడ్డు మీదుగా హైవేకు వెళ్లాలని, అలాగే గార వైపు వెళ్లేవారు ఇదే రోడ్డులో అంపోలు గ్రామం నుంచి గార రోడ్డుకు చేరుకోవాలని సూచించారు. అలాగే వాడాడ దాటిన తర్వాత పార్కింగ్‌లో పెట్టిన వాహనాలు సానివాడ విలేజ్ శాస్త్రులపేట, చెట్టువానిపేట మీదుగా ఎన్‌హెచ్ 16కు చేరుకోవాలన్నారు. పార్కింగ్ కోసం 80 అడుగుల రోడ్డులో కేంద్ర మంత్రి ఇంటి పక్కన ఖాళీ ప్రదేశంలో ఆటోలు, టాటా ఏస్ వంటి వాహనాలు నిలపడానికి కేటాయించామని, ఇదే ఇంటికి ఎదురుగా మోటార్ సైకిళ్లు, కార్ల పార్కింగ్ కోసం మైదానం సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది కొత్తగా 80 అడుగుల రోడ్డులో బీకేఎస్ కాలేజ్ పక్క నుంచి వేసిన రోడ్డు మార్గంలో వెళ్లి కొయ్యాన కన్నయ్య కాలనీలో గల ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో కార్ పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. అరసవల్లి టెంపుల్ మెయిన్ ఆర్క్ ఎదురుగా సూర్యతేజ ఫంక్షన్ హాల్‌కు చెందిన ఖాళీ ప్రదేశంలో వీవీఐపీలకు స్థలం కేటాయించామన్నారు. అలాగే వాడాడ జంక్షన్ వద్ద అసిరితల్లి ఆలయం గుడి ఆవరణలో కార్లు, మోటార్‌సైకిళ్లకు పార్కింగ్ ఇచ్చామని తెలిపారు. ఖాజీపేట నుంచి వచ్చే వాహనాలకు అరసవల్లి మున్సిపల్ హైస్కూల్ పక్కన ఖాళీ ప్రదేశాన్ని కేటాయించామని, ఇక్కడ అన్నిరకాల వాహనాలు పార్క్ చేసుకోవచ్చన్నారు. విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ సీఐ నాగరాజు, వన్‌టౌన్ సీఐ పైడపునాయుడు, టూటౌన్ సీఐ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్‌లో ఉండాల్సిన అమ్మాయి.. ఆయువు కోసం ఆసుపత్రిలో..!

(మొదటిపేజీ తరువాయి)

హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం. డీజీపీ ద్వారకా తిరుమల పదవీ విరమణ చేస్తుండటంతో ఆ ఫంక్షన్‌కు ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి వెళ్లారు. దీంతో జిల్లాలో ఇద్దరు ఏఎస్పీలు, స్వయంగా జిల్లా కలెక్టర్ రిమ్స్‌లో బాధితురాలి వద్దకు వెళ్లారు. అయితే ఆమెకు ఇప్పటికీ తెలివి రాకపోవడంతో ఏం జరిగిందనేది తెలియడం లేదు. అత్యాచారం జరిగిందన్న ఊహాగానాల మేరకు మహిళా గైనకాలజిస్ట్‌లతో కలెక్టర్ దినకర్ పుండ్కర్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంతవరకు పైపై దెబ్బలకు మాత్రమే ట్రీట్మెంట్ ఇస్తున్న వైద్యులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు విద్యార్థిని ప్రైవేట్ పార్ట్‌లపై ఎటువంటి గాయాలూ ఉన్నట్టు ఆధారాలు కనిపించలేదని తెలుస్తుంది. కానీ రిమ్స్ డైరెక్టర్, వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యుల బృందం కలిపి పూర్తిస్థాయి నివేదిక వస్తేగాని ఏ విషయమూ తెలియదు. సంఘటన స్థలం పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా, బాధితురాలి కాల్‌డేటా ఆధారంగా ఒకరిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిందని చెబుతున్న సమయం తర్వాత ఇదే వ్యక్తి ఆటోలో పాతబస్టాండ్ వైపు రావడాన్ని పోలీసులు సీసీ ఫుటేజ్‌లో గుర్తించారు. అలాగే మహిళా కళాశాల హాస్టల్ వద్దకు వెళ్తున్న ఫుటేజ్‌ను కూడా తీసుకున్నారు. ఇప్పుడు బాధితురాలి కాల్‌డేటాలో ఉన్న ఫోన్‌నెంబరులో ఉన్న వ్యక్తి, సీసీ ఫుటేజ్‌లో అనుమానితుడుగా భావిస్తున్న వ్యక్తి ఒక్కడా కాదా అనేది తేలాలంటే బాధితురాలు మాత్రమే సమాధానం చెప్పగలదు. ఫుటేజ్‌లో కనిపిస్తున్న పోలికల మేరకు అనుమానితుడు ఏ ప్రాంతం వాడనేది నిర్ధారణకాలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ వ్యవహారం జిల్లాలో సంచలనం రేపింది.




మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న బీసీ సంక్షేమ శాఖకు చెందిన వసతి గృహం–3లో గురువారం రాత్రి విజయనగరం జిల్లా సంతకవిటి మండలం ఒక గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని శరీరంపై తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడివున్నట్టు సమీపంలోని సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది గుర్తించారు. వసతి గృహం ప్రహరీకి, మరుగుదొడ్లకు వెళ్లే మార్గంలో ఉన్న వాటర్ ట్యాంకల మధ్య ఉన్న చెత్తకుప్పలో విద్యార్థిని అపస్మారక స్థితిలో పడివుందంటూ సమాచారం ఇచ్చిన తర్వాత బీసీ వసతి గృహానికి చెందిన విద్యార్థులు చొరవచూపించి రాత్రి 7.30 గంటల సమయంలో ఆసుపత్రికి తరలించారు. ఆ సమయానికే వసతి గృహానికి చెందిన వార్డెన్ పూర్ణ, ఇతర సిబ్బంది అందుబాటులో లేనట్టు తెలుస్తుంది. అపస్మారక స్థితిలో తీవ్ర గాయాలతో ఉన్న విద్యార్థినిని ఆసుపత్రిలో చేర్చిన విషయాన్ని వార్డెన్‌కు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించినా ఆమె ఫోన్‌స్విచాఫ్ చేసివున్నట్టు భోగట్టా. సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న వార్డెన్ అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఏబీసీడబ్ల్యూకి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఫోన్ స్విచాఫ్ చేసిన వార్డెన్ రిమ్స్‌కు కలెక్టర్ వస్తున్నారని తెలుసుకొని ఉదయం 7.30 గంటలకు తన భర్త విశాఖ ట్రాఫిక్ సీఐ అమితి ప్రసాద్‌తో కలిసి కారులో రిమ్స్‌కు చేరుకున్నారు.

సహ విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో విద్యార్థిని తల్లిదండ్రులు రిమ్స్‌కు చేరుకున్నారు. వారు ఆసుపత్రికి చేరుకునే సమయానికి విద్యార్థిని ఫిట్స్‌తో మరుగుదొడ్డికి వెళుతుండగా పడిపోయిందని ఆసుపత్రిలో వైద్యులకు సమాచారం ఇచ్చి వైద్యం చేయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు కూతురు శరీరంపై ఉన్న గాయాలను చూసి ఫిట్స్ కాదని, ఉద్దేశపూర్వకంగా అఘాయిత్యానికి పాల్పడి ఫిట్స్‌గా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. బాధితురాలికి రిమ్స్‌లో చికిత్స అందిస్తున్నా ఇప్పటికీ అపస్మారక స్థితి నుంచి బయటకు రాలేదు. బాధితురాలి శరీరంపై ఉన్న తీవ్ర గాయాలు, వసతి గృహం సిబ్బంది ఇస్తున్న పొంతనలేని సమాధానాలు, వార్డెన్ పూర్ణ స్పందించకపోవడం ప్రాథమికంగా అనుమానాలకు తావిస్తోంది. వసతి గృహం వార్డెన్‌తో పాటు సిబ్బంది, విద్యార్థులు ప్రతి రోజు ఫేస్ రికగ్నైజ్డ్ యాప్ ద్వారా హాజరు వేయాల్సి ఉంటుంది. వార్డెన్ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మహిళా డిగ్రీ కాలేజీ ప్రాంగణానికి వెళ్లి ఫేస్ రికగ్నైజ్డ్ యాప్ ద్వారా హాజరు వేసుకొని వెనక్కి వస్తున్నారు. గురువారం సాయంత్రం కూడా వార్డెన్ పూర్ణ వసతి గృహానికి రాకుండానే యాప్ ద్వారా హాజరు వేసుకొని వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బాధితురాలు బయటకు వెళ్లినట్టు సిబ్బంది చెబుతున్నారు. అయితే ఎప్పుడు తిరిగి వచ్చిందో మాత్రం చెప్పకుండా మరుగుదొడ్డెకు వెళుతుండగా ఫిట్స్ వచ్చి పడిపోయిందంటున్నారు. గురువారం సాయంత్రం ఫేస్ రికగ్నైజ్డ్ యాప్‌లో హాజరు వేయలేదని సిబ్బంది చెబుతున్నారు. బాధితురాలు బీఎస్సీ ఆరో సెమిస్టర్‌లో భాగంగా ఇంటర్న్‌షిప్‌లో ఉందని సహ విద్యార్థులు తెలిపారు. గురువారం ఆమెకు ఇంటర్న్‌షిప్ స్లాట్ లేదని, ఈక్రమంలోనే సాయంత్రం బ్యూటీపార్లర్‌కు వెళ్లినట్టు చెబుతున్నారు. ఇదే విషయాన్ని సాయంత్రం 6.30 సమయంలో బాధితురాలి తల్లిదండ్రులు ఫోన్ చేస్తే చెప్పినట్టు తెలిసింది. ఆ తర్వాత ఫోన్ చేస్తే ఫోన్ రింగ్ అవుతున్నా లిఫ్ట్‌చేయలేదని బాధితురాలి తల్లిదండ్రులు చెబుతున్నారు.

విద్యార్థి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చేర్చినట్టు సమాచారం ఇచ్చిన 12 గంటల తర్వాత వార్డెన్ పూర్ణ రిమ్స్‌కు చేరుకోవడం పట్ల బాధితురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్ బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం వల్లనే తన కూతురికి ఈ గతి పట్టిందని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తన కూతురుకి ఫిట్స్ సమస్య లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. వార్డెన్ భర్త పోలీసు అధికారి కావడం వల్ల ఒత్తిడి తెచ్చి ఫిట్స్‌తోనే ఆసుపత్రిలో చేరిందని స్టేట్‌మెంట్ ఇప్పించినట్టు బాధితురాలి తల్లిదండ్రులు మీడియా ముందు వెల్లడించారు.

మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ చివరి రోజు కావడంతో రాత్రి 12 గంటల వరకు సందడి చేశారన్న ఆరోపణలున్నాయి. విద్యార్థిని కాలేజీ ప్రాంగణానికి వెనుక భాగంలో ఉన్న వసతిగృహానికి వెళ్లే సమయంలో ఎగ్జిబిషన్‌కు వచ్చేవారిలో ఎవరైనా అఘాయిత్యానికి పాల్పడ్డారా అన్న సందేహాలు ఉన్నాయి. అయితే విద్యార్థులు మాత్రం బాధితురాలు అపస్మారక స్థితిలో పడి ఉన్నచోట ఆమె బ్యాగ్ పూర్తిగా చింపేసి ఉందని, చెప్పులు చిందరవందరగా పడివున్నాయని చెబుతున్నారు. చెవిదిద్దులను శుక్రవారం ఉదయం గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. చెవిదిద్దులను బలవంతంగా లాగిన ఆనవాళ్లు లేవు. ఎందుకంటే ఆమె చెవికుట్లు సరిగానే ఉన్నాయి. అంటే బాధితురాలే చెవిలోనివి తీసివుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

విద్యార్థిని వ్యవహారం రాష్ట్రంలో సంచలనం కావడంతో హోం మంత్రి అనిత స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్టు తెలిసింది. దీంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఉన్న వసతి గృహాన్ని, సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, అనంతరం రిమ్స్ ఐసీయూలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వద్దకు వెళ్లి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి విశాఖపట్నం మెడికవర్‌కు మెరుగైన చికిత్సకు తరలించే ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ వివేకానంద సంఘటన జరిగిన హాస్టల్ పరిసర ప్రాంతాల్లో క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరిస్తుండగా, కలెక్టర్ కూడా వెళ్లి స్వయంగా విచారణ చేపట్టారు.

# న్యూకాలనీకి దారిచూపండి ప్లీజ్!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరం నడిబొడ్డులో ఉన్న న్యూకాలనీకి రోడ్డు మార్గం ఎక్కడుందో చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో నివాసముంటున్న దాదాపు 250 గృహాల వారు రథసప్తమి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న హెలికాప్టర్ టూరిజాన్ని పర్మినెంట్‌గా పెట్టుకొని న్యూకాలనీలో అడుగు పెట్టాలంటే ఎంతవుతుందో బేరమాడటానికి బయల్దేరుతున్నారు. ఎందుకంటే న్యూకాలనీలో ఉన్న రోడ్ల ద్వారా ఇళ్లకు చేరుకోవడం దాదాపు అసాధ్యమనే నిర్ణయానికి వచ్చేశారు. ఇక్కడ ప్రతీ లైన్‌లోనూ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, గొడౌన్లు ఉండటంతో కామన్‌సెన్స్ లేకుండా రోడ్లు ఎంతమేరకు వెడల్పు ఉంటే అంతమేరకు భారీ వాహనాలను పార్క్ చేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండటాన్ని అప్పటి రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు దగ్గర్నుంచి ఇప్పటి ఎమ్మెల్యే గొండు శంకర్ వరకు, కలెక్టర్ లక్ష్మీనర్సింహం దగ్గర్నుంచి ప్రస్తుత కలెక్టర్ దినకర్ వరకు కలిసి కాలనీవాసులు వినతిపత్రాలు ఇస్తునే ఉన్నారు. కానీ ఒక్కరోజు ఒక్కరైనా పట్టించుకుంటే ఒట్టు. న్యూకాలనీలో అందరూ అఫీషియల్స్ ఉంటారన్న విషయం అందరికీ తెలిసిందే. సాధారణంగా ఇటువంటి ఓటుబ్యాంకు ధర్మాన ప్రసాదరావు ఏ పార్టీలో ఉన్నా ఆయనకు అనుకూలంగా ఉంటుంది. గత ఎన్నికల వరకు ఈ ప్రాంతవాసులు ధర్మానకే జైకొడుతూవచ్చారు. కానీ ఆయన సోదరుడు చల్లా శ్రీను ఈ వార్డులో ఉంటూ ఆక్రమణలకు ప్రోత్సహించారనే కోపంతో ఈసారి న్యూకాలనీ ఓటర్లు అధిక శాతం టీడీపీకి ఓటేశారు. ధర్మాన ప్రసాదరావు రెవెన్యూమంత్రిగా ఉన్నప్పుడు సమస్యలు విన్నవించినా పరిష్కారం కాలేదని, తెలుగుదేశం అధికారంలోకి వస్తే న్యూకాలనీ బాగుపడుతుందని భావించారు. కానీ ఇంతవరకు అది జరగలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడున్న ప్రతీ అపార్ట్‌మెంట్‌లో అన్ని ప్లాట్‌లకు వెళ్లి మరీ గొండు శంకర్ ఆశీస్సులు పొందారు. తమ రోడ్ల మీద ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కనీసం నడిచే అవకాశం కూడా ఇవ్వడంలేదని కాలనీవాసులు విన్నవించినప్పుడు పోలీసులతో వీటిని క్రమబద్ధీకరించే పని కూడా చేయడంలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## మూడు రోజులపాటు రథసప్తమి వేడుకలు వైభవంగా జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయని, మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎడ్లబండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తామని, అలాగే డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హెలికాప్టర్ నిర్వాహకులకు సైట్ చూపించారు. హెలికాప్టర్ నిర్వహణకు సంబంధించి చేపట్టవలసిన భద్రతా చర్యలపై సమీక్షించారు. నిర్వహణకు సంబంధించి నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వెబ్‌సైట్‌లో టికెట్ బుకింగ్ అందుబాటులో ఉండేలా చూడాలని, ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. టికెట్ తీసుకున్న యాత్రికులు ఎలా హెలిపేడ్‌కి చేరుకోవాలి, వారికి వేచి ఉండేందుకు కావలసిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ డచ్ బిల్డింగ్ వద్ద విద్యుత్ అందుబాటులో ఉండేలా, అలాగే మునిసిపల్ అధికారులు పరిసరాలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, డ్వామా పీడీ సుధాకరరావు, కొవ్వాడ ప్రత్యేక ఉపకలెక్టర్ లక్ష్మణరావు, జిల్లా విపత్తు నివారణ అధికారి మోహనరావు, ఏఈ సురేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.







# యావజ్జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహానుభావుడు

- **వీజీకే ఆశయసాధనకు కృషి చేయాలి**
- **విజయగౌరి గెలుపునకు కృషి చేద్దాం**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సిఐటియు తొలితరం నాయకులు, జిల్లా ప్రథమ అధ్యక్షులు విజికే మూర్తి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మూర్తి చిత్రపటం వద్ద సంతాపం తెలిపి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజికె మూర్తి యావజ్జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహానాభావుడని అన్నారు. జిల్లాలో సిఐటియు నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. శ్యాంక్రగ్ పిస్టన్స్ & రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమలో సిఐటియు అనుబంధ యూనియన్ ఏర్పాటు చేసి ఎనిమిది నెలలు సుదీర్ఘ సమ్మెకు అండగా నిలబడి సమస్య పరిష్కారానికి చేసిన కృషి కార్మికుల గుండెల్లో ఇప్పటికీ మరిచిపోలేని విషయమని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ



ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ప్రకటించారు. విద్యారంగం, ఉద్యోగుల, ప్రజల సమస్యలు పరిష్కారానికి పిడిఎఫ్ ఎం.ఎల్.సి.లు కృషి చేస్తున్నారని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5న జరిగే నిరసనల్లో కార్మికవర్గం పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్.వి.రమణ, అల్లు సత్యనారాయణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, జి.అమరావతి, బి.ఉత్తర, ఆర్.ప్రకాశరావు, కె.చంద్రశేఖర్, ధనలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.